క్లుప్తంగా

రూ.2లక్షల విరాళం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లి బాల వికాస సంస్థ(ఆర్‌వో ప్లాంట్) తరఫున గ్రామంలో నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సోమవారం రెండు లక్షల రూపాయల విరాళాన్ని గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులకు అందజేశారు. కౌన్సిలర్లు పి.కృష్ణాజీరావు, బీఆర్ఎస్ నాయకుడు కాసర్ల స్వామి, వీడీసీ, బాల వికాస ప్రతినిధులు నీలం రాజలింగం, కుసుల సిద్ధిరాములు, సల్ల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదకరం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అతివేగం ప్రమాదకరమని ఎస్సై కోనా రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పోచారం చౌరస్తాలో అతివేగంగా వెళ్తున్న వాహనాలను స్పీడ్ గన్‌తో గుర్తించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతివేగంగా వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయని, రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ గన్‌తో జరిమానాలు విధిస్తున్నామని ఎస్సై కోనా రెడ్డి తెలిపారు. పోలీస్ సిబ్బంది రవీందర్, గోరి, శంకర్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మద్నూర్(జుక్కల్): సీఎం సహాయనిధితో ఎంతో మంది రోగులకి వైద్య సహాయం అందుతుందని సర్పంచ్ సురేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన విఠల్‌కు సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్సీపటేల్, సర్పంచ్ సురేశ్ చేతుల మీదుగా రూ.29,500ల చెక్కును అందించారు. నాయకులు కంచిన్ హన్మాండ్లు, సాయి ఉన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళి



కామారెడ్డి అర్బన్: విశ్వకవి, నోబుల్ అవార్డు గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి సంస్థ జిల్లా చైర్మన్ పి.రాజేశ్వర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి జాతీయ గీతాన్ని అందించి రవీంద్రనాథ్ ఠాగూర్ దేశ భక్తిని పెంపొందించారని రాజేశ్వర్ అన్నారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



బాన్సువాడ రూరల్: పోచారం గ్రామంలో సోమవారం పోచారం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులందరికి బ్యాగులు పంపిణీ చేశారు. ట్రస్టు నిర్వాహకులు పోచారం సురేందర్‌రెడ్డి ఇది వరకే పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేయించారని ఎస్ఎంసీ చైర్మన్ లతీఫ్ తెలిపారు. స్కూల్ బ్యాగులు కూడా పోచారం సురేందర్‌రెడ్డి విద్యార్థులకు విరాళంగా అందించారన్నారు. గ్రామస్తులు విజయ్‌గౌడ్, సావిత్రి, సాయిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సచిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వన నర్సరీల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): దూప్‌సింగ్, గిర్నితండా గ్రామ పంచాయతీలను సోమవారం బాన్సువాడ డివిజన్ పంచాయతీ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో సంపూర్ణ పారిశుధ్య పనులను, మురికి కాలువల శుభ్రతను తెలుసుకున్నారు. అనంతరం గ్రామాల్లోని వన నర్సరీలను ఆయన పరిశీలించారు. హోం సీడ్ మొక్కలను ఇంటింటా నాటించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ చెందర్ రాథోడ్, మండల పంచాయతీ అధికారి అబ్బాగౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులున్నారు.

తహసీల్దార్లుగా బాధ్యతల స్వీకరణ



హిమబిందు



భిక్షపతి

సదాశివనగర్/నిజాంసాగర్/నాగిరెడ్డిపేట/భిక్కనూరు:సదాశివనగర్ తహసీల్దార్‌గా ఆర్.హిమబిందు, నిజాంసాగర్ తహసీల్దార్‌గా హెచ్.భిక్షపతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నాగిరెడ్డిపేట తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ మస్రూర్ కామారెడ్డి కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ రాందాస్‌కు నాగిరెడ్డిపేట బాధ్యతలు అప్పగించారు.

శిథిలావస్థలో పాఠశాల భవనాలు

- విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం
- భవనాలను కూల్చని యంత్రాంగం



పాడుబడిన కొత్తాబాది పాత పాఠశాల భవనం

బాన్సువాడ రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారాయి. నూతన భవన సముదాయాలను నిర్మించడంతో ప్రస్తుతం వాటిలో విద్యాభ్యాసం కొనసాగడం లేదు. అయినా ఇంటర్వెల్, ఆటల సమయంలో విద్యార్థులు వాటి కిందికి వెళ్లి ఆడుకుంటున్నారు. శిథిలావస్థలో ఉన్న ఆ భవనాలు కూలితే విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. నూతన భవనాలను నిర్మించగానే పాత వాటిని నేలమట్టం చేసి విద్యార్థులు ఆడుకోవడానికి వీలుగా చదును చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానోపాధ్యాయులు తమ వద్ద ఎలాంటి నిధులు లేవని చేతులెత్తేస్తుండగా, స్థానిక సర్పంచ్‌లు సైతం నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొత్తాబాది, తాడ్కోల్, మొగులాన్‌పల్లి, బుడ్మి, బోర్లం, దేశాయిపేట్, కోనాపూర్ ఇలా ప్రతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిథిల భవనాలు దర్శనమిస్తున్నాయి. శిథిల భవనాలు పాములు, తేళ్లు, ఇతర విష కీటకాలకు నిలయంగా మారుతున్నాయి.పైకప్పు పెచ్చులూడి, పిచ్చిగడ్డితో దర్శనమిస్తున్నాయి. సుమారు 30–40 ఏళ్ల క్రితం నిర్మించిన పాత భవనాలు ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు మరింత ప్రమాదకరంగా మారాయి.

ఇరుకుగా ప్రాంగణాలు.. క్రీడలకు దూరం

విద్యార్థులకు తరగతి గదిలో నాలుగు గోడల మధ్య విద్యా బోధన ఎంత ముఖ్యమో వారికి ఆటలు కూడా అంతే ముఖ్యం. క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల వారి శారీరక పెరుగుదలతో పాటు మానసిక వికాసం పొందే అవకాశం ఉంటుంది.

పాఠశాల ప్రాంగణాల్లో కొత్త భవనాలు నిర్మించడంతో విద్యార్థులకు క్రీడాప్రాంగణం చిన్నబోయింది. పాత భవనాలను తొలగించినట్లయితే మైదానం పెరిగి విద్యార్థులు చక్కగా ఆడుకునే అవకాశం కలుగుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి పొంచి ఉన్న ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తొలగిస్తే సౌకర్యంగా ఉంటుంది



శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. అక్కడున్న ప్రధానోపాధ్యాయులు కొత్త భవనాలు మంజూరైనపుడు కాంట్రాక్టర్‌ను ఒప్పించి పాత భవనాలను తొలగించుకుంటే సమస్య రాదు. లేదంటే ఎస్ఎంసీ సమావేశమై తీర్మానం చేసి శిథిల భవనం తొలగించగా వచ్చే పాత ఇనుము, కిటికీలు, కట్టెలు విక్రయించి ఖర్చుకు సరిపెడితే ఇబ్బంది లేదు.

– నాగేశ్వరరావు, ఎంఈవో, బాన్సువాడ

'గాలికుంటు' టీకాలు వేయించాలి



చిన్న ఎక్లారలో టీకాలు వేస్తున్న వైద్యులు

మద్నూర్(జుక్కల్): పశువులకు తప్పకుండ గాలికుంటు టీకాలు వేయించాలని రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి బబ్బర్ పేర్కొన్నారు. మండలంలోని చిన్న ఎక్లారలో సోమవారం పశు సంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు టీకాలు వేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

భిక్కనూరు: పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి దేవేందర్ అన్నారు. లక్ష్మీ దేవునిపల్లిలో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు టీకాలు వేశారు. సర్పంచ్ సుమలత, పాల కేంద్రం అధ్యక్షులు లోహిత్‌రెడ్డి తదితరులు ఉన్నారు

సదాశివనగర్‌లో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశుగణ సహాయకుడు కిషోర్ వేశారు. సర్పంచ్ జానకి, ఎంపీటీసీలు సంకరి లక్ష్మి, ఎడ్ల రేణుక, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలు అధైర్య పడొద్దు



బాన్సువాడ రూరల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్ట కాలంలో అధైర్య పడవద్దని, వారికి పార్టీ అండగా నిలుస్తుందని బాన్సువాడ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కాసుల రోహిత్ అన్నారు. సోమవారం తాడ్కోల్‌లో ఇటీవల వర్షాలకు నివాసపు ఇల్లు కూలిపోయిన కార్యకర్త బోర్లం సాయిలును పరామర్శించి నగదు సాయం అందించారు. ప్రభుత్వం వెంటనే భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయి నిరాశ్రయులైన వారందరికి పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నేతలు మదుసూధన్ రెడ్డి, అందె రమేష్, రవి, దత్తు, అబ్బాస్, జీవన్, అంజయ్య, హన్మాండ్లు ఉన్నారు.

'ఆధ్యాత్మిక చింతనతో మానవళికి ప్రశాంతత'



దేవునిపల్లిలో పర్యటిస్తున్న గోపాల్ మహరాజ్

కామారెడ్డి అర్బన్: ఆధ్యాత్మిక చింతన మానవళికి ప్రశాంతతనిచ్చే ఏకైక మార్గమని గోపాల్ మహరాజ్ రామదాసి మూలే అన్నారు. సోమవారం కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లిలో భిక్షాటన కార్యక్రమం నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. దేవునిపల్లి హన్‌మాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు మర్కంటి స్వామి, రాజుపాటిల్, ద్యావరి నవీన్, రాహుల్ కుమార్, కౌన్సిలర్ కాసర్ల గోదావరి, స్వామి, కుసుమ సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం



మాచారెడ్డి : తల్లి పాలే బిడ్డకు శ్రేష్టమని భవానీపేట గ్రామ సర్పంచ్ మద్దెల రాజు అన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాలపై గర్భిణులు, బాలింతలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడారు. ముర్రు పాలే బిడ్డకు రోగనిరోధక శక్తిని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్ గౌడ్, అంగన్‌వాడి టీచర్లు సుజాత, మమత, భాగ్యలక్ష్మి, రజిని తదితరులున్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల నిరసనలు



బిచ్కుందలో రోడ్డుపై నిరసన తెలుపుతున్న కార్మికులు



బీబీపేటలో మోకాళ్లపై కూర్చుని..

బిచ్కుంద/నిజాంసాగర్/బీబీపేట:న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ 33 రోజుల నుంచి పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్న సంగతి తెల్సిందే. సమ్మెలో భాగంగా సోమవారం వారు బిచ్కుందలో రోడ్డుపై బైఠాయించి, బీబీపేటలో మోకాళ్లపై కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జుక్కల్ మండల కేంద్రంలో కార్మికులకు ఉపసర్పంచులు మద్దతు తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ ఉమాకాంత్ అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు తరచూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఆరోగ్య బోధకులు దస్తీరాం, సంగమేశ్వర్, నాగమణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గద్దర్ మరణం తీరని లోటు



చిల్లర్గి ప్రభుత్వ పాఠశాలలో సంతాపం తెలుపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో.. షబ్బీర్ అలీ



కామారెడ్డి ఆర్ట్ అండ్ సైన్స్ కాలేజీలో..

సాక్షి నెట్‌వర్క్: ప్రజా గాయకుడు గద్దర్ ఆకస్మిక మృతికి సంతాపం తెలుపుతూ జిల్లావ్యాప్తంగా పలువురు నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూ లమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన మరణం తెలుగు ప్రజలకు తీరని లోటు అని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. గద్దర్ పీడితుల పక్షాన నిలబడి ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య అన్నారు. గద్దర్ మృతిపై సోమవారం కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు.

సమాచారం..

నేడు ఆరేపల్లికి ప్రభుత్వ విప్ రాక

రాజంపేట: ఆరెపల్లి గ్రామానికి నేడు (మంగళవారం) ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ విచ్చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు భిక్యాజి బల్వంతరావ్ సోమవారం తెలిపారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

అండగా ఉంటా.. అధైర్య పడొద్దు



దేవయ్యను పరామర్శిస్తున్న గంప గోవర్ధన్



హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రభుత్వవిప్

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద దేవయ్యను ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్ సోమవారం పరామర్శించారు. దేవయ్య కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వవిప్ ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. అండగా ఉంటానని, అధైర్యపడవద్దని దేవయ్యతో పాటు ఆయన కుటుంబీకులకు హామీ ఇచ్చారు. నాయకులు మహేందర్‌రెడ్డి, సతీష్ రెడ్డి ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణస్వీకారం

భిక్కనూరు: భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పట్లూరి హన్మంత్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా పురాం రాజమౌళి, డైరెక్టర్‌గా బద్దం రాకేష్‌రెడ్డిలను సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ హాజరై వారిని సన్మానించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. రైతులకు సేవ చేసి రైతు సంక్షేమం కోసం పాటు పడాలని సూచించారు.

స్థల దాతకు సన్మానం

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డికి జీపీ నిర్మాణానికి 5 గుంటల స్థలాన్ని అందజేసిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు అల్లాడి పెంటయ్యను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. విలువైన స్థలాన్ని జీపీ నిర్మాణానికి ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. సర్పంచ్ లక్ష్మి, రాజలింగం, ఎంపీటీసీలు సాయాగౌడ్, మంజుల, విండో చైర్మన్ రాజాగౌడ్, నాయకులు సతీష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

చేనేత బోర్డును పునఃప్రారంభించాలి



జిల్లా కేంద్రంలో చేనేత నడకలో పద్మశాలీలు



దోమకొండలో చేనేత జెండా ఎగురవేస్తున్న గడికోట ట్రస్టు, చేనేత సంఘం ప్రతినిధులు

కామారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సెంట్రల్ చేనేత బోర్డును పునః ప్రారంభించాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగాద లక్ష్మీ నర్సయ్య కోరారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో చేనేత నడక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రోటరీ క్లబ్ ఆడిటోరియంలో మాట్లాడారు. చేనేత బోర్డు కోసం చేనేత జౌళి శాఖ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి వినతిపత్రాలు పంపామని తెలిపారు.

దోమకొండలో..

దోమకొండ: మండల కేంద్రంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ఆనంద్‌భవన్‌లో చేనేత జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ట్రస్టు మేనేజర్ బాబ్జీ మాట్లాడారు. మొట్టమొదటి స్వదేశీ ఉద్యమం 1905, ఆగస్టు 7న మొదలైందని దానిని జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, సర్పంచ్ అంజలి, ఉపసర్పంచ్ శ్రీకాంత్, సింగిల్‌విండో చైర్మన్ నాగరాజ్‌రెడ్డి, చేనేత సంఘం దోమకొండ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

పిట్లంలో ..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం వద్ద సోమవారం చేనెత కార్మికుల దినోత్సవాన్ని సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళ్లు అర్పించారు.

పీహెచ్‌సీ దారిలో వెలుగులు

సాక్షి ఎఫెక్ట్..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పీహెచ్‌సీ ప్రధాన గేట్ నుంచి లోనికి వెళ్లేదారిలో సోమవారం రాత్రి వెలుగులు వచ్చాయి. దారిలో స్తంభానికి ఉన్న బల్బు వెలగకపోవడంతో 'సాక్షి' దినపత్రికలో సోమవారం 'అంధకారంలో పీహెచ్‌సీ దారి'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి గోపాల్‌పేట సర్పంచ్ వంజరి సునీత స్పందించారు. వెంటనే బల్బును ఏర్పాటు చేయించారు. వెంటనే సర్పంచ్ సునీత చర్యలు చేపట్టడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



షీ టీమ్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సిబ్బంది

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై సోమవారం షీ టీమ్ బృందం విద్యార్థులకు అవగాహన కల్పించింది. అమ్మాయిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధింపులకు గురి చేసినా వెంటనే షీ టీమ్ సభ్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, ఎస్సై ప్రభాకర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సై జాబ్‌లకు ఎంపిక



ప్రసాద్‌రావు

లింగంపేట(ఎల్లారెడ్డి): మోతె గ్రామానికి చెందిన వజీర్ ప్రసాద్‌రావు ఏఆర్ ఎస్సైగా ఎంపికయ్యారు. ఆదివారం వెలువడిన ఎస్సై ఫలితాల్లో ఎంపికైనట్లు తల్లిదండ్రులు వజీర్ రాజేశ్వర్‌రావు లలితాబాయి తెలిపారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత రెండు సంవత్సరాలు ఎస్సై ఉద్యోగం కోసం శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు.

ఎస్సైగా ఎల్లంపేట కుర్రోడు..



మాలోత్ నరేశ్

మాచారెడ్డి : ఎల్లంపేట గ్రామానికి చెందిన మాలోత్ నరేశ్‌కు ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ట్రిపుల్ ఐటీ బాసరలో చదివిన నరేశ్ ఎస్సై ఉద్యోగంపై ఆసక్తితో ఏడు నెలల పాటు కసరత్తు చేసి ఉద్యోగం సాధించాడు.

సులభ పద్ధతిలో బోధించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల డీఆర్పీలు సుజాత, అనురాధ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మౌలిక భాష గణిత సామర్థ్యాల సాధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సాయన్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వహీద్ సిద్ధిఖీ, సీఆర్పీలు, 60 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ధన్‌సింగ్ నాయక్

రామారెడ్డి (ఎల్లారెడ్డి): కాంగ్రెస్ కామారెడ్డి జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా రామారెడ్డి మండలం ఘన్‌పూర్ తండాకు చెందిన భూక్యధన్‌సింగ్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో మాజీ మంత్రి షబ్బీర్ అలీ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట సర్వాగౌడ్, బాగన్న, కుమ్మరి శంకర్ పాల్గొన్నారు.

దోమకొండ అధ్యక్షుడిగా సీతారాం మధు

దోమకొండ: కాంగ్రెస్ పార్టీ దోమకొండ పట్టణ అధ్యక్షుడిగా సీతారాం మధు, బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా గొట్టిముక్కల గ్రామానికి చెందిన మడతల సత్యనారాయణలను నియమించారు. మాజీ మంత్రి షబ్బీర్‌అలీ నియామక పత్రాలను అందజేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి తెలిపారు. మండల నాయకులు రామస్వామిగౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్ తదితరులు వీరిని సన్మానించారు.

రైతుల శ్రమదానం

లింగంపేట(ఎల్లారెడ్డి): అయిలాపూర్ శివారులోని పాముల వాగు వంతెన వద్ద గ్రామానికి చెందిన రైతులు శ్రమదానం చేసి చెత్తను తొలగించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాములవాగు ఉధృతంగా ప్రవహించింది. దాంతో వంతెన కానాల్లో పెద్ద పెద్ద కర్ర దుంగలు వచ్చి అడ్డుగా నిలిచాయి. దాంతో ఖానాల నుంచి వరద నీరు వెళ్లకుండా అడ్డుగా ఉండడంతో సోమవారం పలువురు రైతులు శ్రమదానం చేసి వాటిని తొలగించి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

మత్తమాలలో హోమియో మందుల పంపిణీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మత్తమాలలో ఉచితంగా హోమియో మందులను సర్పంచ్ ప్రజలకు పంపిణీ చేశారు. ఆయుష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ గ్రామ ప్రజలకు డెంగీ వ్యాధి సోకకుండా ముందస్తు చర్యలో భాగంగా మందులను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ ఊషాగౌడ్, వైద్యులు శ్వేత తదితరులున్నారు.

పలు గ్రామాలలో వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాలలో మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వెల్లుట్లపేట, భిక్కనూర్ తదితర గ్రామాలలో మత్తమాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ ప్రజలకు వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సర్పంచులు చిరంజీవులు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

తిప్పారం జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని తిప్పారం గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేసినట్లు సర్పంచ్ సాయిలు తెలిపారు. నూతన భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో తిప్పారం ఉప సర్పంచ్ లక్ష్మణ్ రావు, స్థల దాత సోలంకి మాధవరావు, డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్, గాంధారి సర్పంచ్ సంజీవు, గొల్లాడి తండా సర్పంచ్ రవి, తదితరులు పాల్గొన్నారు.